సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 2 । మార్చి । 2025




రంజాన్ సందడి

పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభమైంది. శనివారం రాత్రి ఆకాశంలో నెలవంక దర్శనంతో పండుగ సందడి మొదలైంది. 8లో ▸



ఆలయాల అభివృద్ధికి కృషి

ప్రభుత్వ నిధులు, దాతలసాయంతో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. 8లో ▸



న్యూస్‌రీల్

4న వయోవృద్ధులకు ఉపకరణాల పంపిణీ

చేవెళ్ల: కృతిమ అవయవాల తయారీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో వయోవృద్ధులు, దివ్యాంగులకు కావాల్సిన ఉపకరణాలను ఉచితంగా అందజేయనున్నట్లు చేవెళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ హెప్సిబా తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలతో చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాలకు చెందిన వయోవృద్ధులకు చేతికర్రలు, వాకర్స్, వినికిడి యంత్రాలు, దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లు, కాలిపర్స్ కృత్రిమ కాళ్లు తదతర వాటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 4న చేవెళ్లలోని అట్లాస్ మినీ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కార్యక్రమానికి వచ్చే వారు దివ్యాంగ ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్‌కార్డు తదితర పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. అర్హులైన వారిని గుర్తించి అవసరమైన పరికరాలు అందజేయనున్నట్లు వివరించారు.

ఈ భూమి ప్రభుత్వానికి చెందినది



పిగ్లీపూర్‌లోని భూదాన్ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పిగ్లీపూర్ గ్రామం సర్వే నంబర్ 17లో గల భూదాన్, సీలింగ్ భూముల్లో శనివారం మండల రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. భూదాన్, సీలింగ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్న ఫిర్యాదులతో తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్వేయర్ జ్యోతి, ఆర్ఐ నిజాముద్దీన్ సిబ్బందితో కలిసి సూచిక బోర్డులను నాటారు. సర్వే నంబర్ 17/2,3లలోని 116.10 ఎకరాల సీలింగ్ భూమి, 17/పార్ట్‌లోని 60 ఎకరాల భూదాన్ భూములకు హద్దులు ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. పైన పేర్కొన్న సర్వే నంబర్లలోని భూములన్నీ ప్రభుత్వానికి చెందినవని ఈ భూములపై ఎలాంటి లావాదేవీలు జరపకూడదని ఆయన హెచ్చరించారు.

ఫార్మా భూ కుంభకోణంపై దర్యాప్తు చేయాలి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

యాచారం: ఫార్మాసిటీ భూ కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులు, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకునే విషయంలో కాంగ్రెస్ సర్కార్ ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో అర్థం కావడం లేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం రైతు సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీ భూ కుంభకోణంపై దర్యాప్తు జరిపిస్తామన్న కాంగ్రెస్ పెద్దలు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఫార్మాసిటీ భూ కుంభకోణంలో అధికారుల పాత్ర ఉందనే ఆ శాఖ అధికారులు దర్యాప్తును ముందుకు సాగనీయడం లేదన్నారు. ఫార్మాసిటీ పరిహారాన్ని అక్రమార్కులకు కట్టబెట్టి ఆర్డీఓ, తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్‌ఓలు, సర్వేయర్లు రూ.కోట్లు సంపాదించారని ఆరోపించారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసి టీజీఐఐసీ పేరు మీద ఉన్న పట్టా భూముల రికార్డులను మళ్లీ రైతుల పేర్లపై నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తావునాయక్, శ్రీశైలం, ఐలయ్య, దేవరకొండ సత్తయ్య, జంగారెడ్డి, బుగ్గరాములు, భాషయ్య పాల్గొన్నారు.

సత్తాచాటిన గురునానక్ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: జాతీయ స్థాయి 12వ ఈవీ గోకార్ట్ డిజైన్ చాలెంజ్ పోటీల్లో గురునానక్ మెకానికల్ విద్యార్థులు సత్తా చాటారు. కోయంబత్తూరులోని కారీ మోటార్ స్పీడ్ వేలో ఐఎస్ ఈ- మోటార్ స్పోర్ట్స్ నిర్వహించిన దేశవ్యాప్త పోటీల్లో 80 ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కోయంబత్తూరులోని కుమారుగురు కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ఈజీ రేసింగ్ టీమ్ విజేతగా, గురునానక్ టీమ్ రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రన్నరప్ సాధించిన విద్యార్థులను గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ కోహ్లి, ఎండీ సైనీ తదితరులు అభినందించారు.

టీకా.. ఇవ్వలేక!

రోడ్ల పక్కన, చెత్త కుప్పల్లో దర్శనం

- సిబ్బంది నిర్లక్ష్యం.. నీరుగారుతున్న లక్ష్యం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం
- అస్తవ్యస్తంగా టీకాల కార్యక్రమం



మీర్‌పేటలోని ఓ సబ్‌సెంటర్ వద్ద బయట పడేసిన విలువైన వ్యాక్సిన్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం.. కొంత మంది సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అభాసుపాలవుతోంది. జాతీయ వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు సహా చిన్నారులకు వివిధ రకాల వ్యాక్సిన్లు ఉచితంగా సరఫరా చేస్తోంది. ప్రతి బుధ, శనివారాల్లో ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలకు ఏఎన్ఎంలు చేరుకుని అక్కడికి వచ్చిన చిన్నారులకు వ్యాక్సినేషన్ చేయాల్సి ఉంది. కొంత మంది సిబ్బంది ఈ కార్యక్రమాన్ని తేలిగ్గా తీసుకుంటున్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువులకు ఇవ్వాల్సిన టీకాలు.. రోడ్డుపై, చెత్త కుప్పల్లో దర్శనమిస్తున్నాయి. టార్గెట్ కోసం పిల్లలకు టీకాలు వేయకపోయినా వేసినట్లు తప్పుడు రికార్డులు నమోదు చేస్తున్నట్టు విమర్శలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు టీకాల సరఫరా, నిల్వ, వినియోగంపై ఆరా తీయాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో రూ.లక్షల విలువ చేసే టీకాలు రోడ్డు పాలవుతున్నాయి.

కొరవడిన నిఘా

గర్భిణులకు నాలుగు, ఐదో నెలలో టీడీ వ్యాక్సిన్ (టెటనస్ అండ్ డిఫ్తీరియా) రెండు డోసులు ఇస్తారు. వీటితో పాటు ఐరన్, క్యాల్షియం మందులను మూడు నెలల పాటు ఉచితంగా సరఫరా చేస్తారు. ప్రసవ సమయంలో బాలింతలు అధిక రక్తస్రావంతో బాధపడుతుంటారు. వీరికి ఐరన్, క్యాల్షియం టాబ్లెట్లను సరఫరా చేస్తారు. కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, పోలియో, కామెర్లు, మెదడువాపు, నిమోనియా వంటి జబ్బుల బారిన పడకుండా ప్రభుత్వం పుట్టిన ప్రతి శిశువుకు జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా ఆయా టీకాలను ఉచితంగా ఇస్తోంది. బుధవారం ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రాల్లో, శనివారం కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పుట్టిన వెంటనే బీసీజీ, హెపటైటిస్ బీ, పోలియో చుక్కలు, రోటా ఓరల్ డ్రాప్స్ ఇవ్వాల్సి ఉంటుంది. తర్వాత 45 రోజులకు పెంటా వాక్సిన్‌తో పాటు పోలియో, ఐపీవీ ఫస్ట్ డోసు, రోటా ఓరల్ డ్రాప్స్ ఇస్తారు. శిశువు వయసు రెండున్నర నెలలకు చేరుకున్న తర్వాత పెంటా రెండో డోసు, పోలియో రెండో డోసు సహా రోటా ఓరల్ డ్రాప్స్ ఇవ్వాల్సి ఉంది. ఇక మూడున్నర నెలలకు పెంటా మూడో డోసు, ఓపీవీ మూడో డోసు, ఐపీవీ రెండో డోసు ఇవ్వాలి. పదో నెలలో ఎంఆర్ ఫస్ట్ డోసు, 16 నుంచి 18 నెలలకు ఎంఆర్ రెండో డోసు సహా విటమిన్ 'ఎ' ద్రావణం తాగించాలి. ఐదేళ్లకు డీటీటీ, పదేళ్లకు టీడీ ఫస్ట్ డోసు, 16 ఏళ్లకు టీడీ సెకండ్ డోసు ఇవ్వాల్సి ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యంతో మెజార్టీ పిల్లలకు మొత్తం టీకాలు అందకుండా పోతున్నాయి.

డిఫ్తీరియా గుప్పిట్లో చిన్నారులు

నిజానికి టీకాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది. ఫార్మా కంపెనీల నుంచి కొనుగోలు చేసిన ఈ వ్యాక్సిన్లను ముందు సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో నిల్వ చేస్తుంది. జిల్లాల నుంచి అందిన ఇండెంట్ల ఆధారంగా వ్యాక్సిన్లు సరఫరా చేస్తుంది. మొదటగా జిల్లా డీఎంహెచ్ ఆఫీసులోని నిల్వ కేంద్రానికి వ్యాక్సిన్ చేరుతుంది. అటు నుంచి క్షేత్రస్థాయి నుంచి వచ్చిన విజ్ఞప్తుల ఆధారంగా ఆయా ఆస్పత్రుల్లోని ఫార్మసీలకు వ్యాక్సిన్ సరఫరా చేస్తుంటారు. అటు నుంచి ఏరియాల వారీగా ఏఎన్ఎంలకు అందజేస్తుంటారు. బీసీజీ, మిజిల్స్ వ్యాక్సిన్ బాటిల్ ఓపెన్ చేసిన నాలుగు గంటల్లోనే వాడాలి. తర్వాత అది పనికి రాకుండా పోతోంది. అదే పెంటా, టీటీ వ్యాక్సిన్లు, పోలియో చుక్కలు 28 రోజుల వరకు వినియోగించుకునే అవకాశం ఉంది. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు సబ్ సెంటర్ల వారీగా ప్రత్యేక సూపర్ వైజర్లను సైతం నియమించారు. ఏ సెంటర్‌లో.. ఏ రోజు.. ఎంత మందికి వ్యాక్సిన్ వేయించుకున్నారు, ఎన్ని వాయిల్స్ వినియోగించారు, మిగిలిన బాటిళ్లను ఎక్కడ నిల్వ చేశారు, ఖాళీ బాటిల్స్ ఎక్కడ భద్రపరిచారు, టీకా వేసిన తర్వాత ఎమైనా రీయాక్షన్స్ వచ్చాయా వంటి అంశాలపై సూపర్ వైజర్లు ఆరా తీయాల్సి ఉంది. మెజార్టీ సూపర్ వైజర్లు దీన్ని పట్టించుకోవడం లేదు. ఫలితంగా బాలాపూర్, పహాడీషరీఫ్, జల్ పల్లి, చాంద్రాయణగుట్ట, రాజేంద్రనగర్, శంషాబాద్ తదితర ప్రాంతాల్లోని చిన్నారులు డిఫ్తీరియా, మెదడువాపు, కామెర్ల వంటి జబ్బుల బారిన పడుతున్నట్లు తెలిసింది.

నిర్లక్ష్యాన్ని సహించం

టీకాలను పడేసిన అంశంపై సమగ్ర విచారణకు ఆదేశించాం. ఏ సెంటర్‌కు ఎంత వాక్సిన్ సరఫరా చేశారు.. ఇప్పటి వరకు ఎంత మందికి వ్యాక్సిన్ వేశారు.. మిగిలిన వ్యాక్సిన్ ఎక్కడ నిల్వ చేశారు.. వంటి అంశాలపై ఆరా తీస్తాం. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- ఇంటర్, టెన్త్ ఎగ్జామ్స్ పక్కాగా నిర్వహించాలి
- ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దు
- విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: త్వరలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్, పదో తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో ఆయా విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 5 నుంచి 25 వరకు ఇంటర్మీడియెట్ పరీక్షలు, ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు టెన్త్ పరీక్షలు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి మొత్తం 1,47,211 మంది విద్యార్థులు పరీక్ష రాయబోతున్నారని, వీరి కోసం 185 కేంద్రాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. టెన్త్‌లో 51,749 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానుండగా, వీరి కోసం 249 కేంద్రాలను ఎంపిక చేసినట్లు వివరించారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒక్కో సిట్టింగ్ స్క్వాడ్ సహా చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎంపిక చేసిన రూట్లలో రూట్ అధికారులను కేటాయించామని వెల్లడించారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించకూడదన్నారు.

కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో ఆయా కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను ముందే మూసివేయించాలని, పరీక్ష కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, నిరంతర విద్యుత్, తాగునీరు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనంలో పరీక్ష కేంద్రాలకు తరలించాలన్నారు. విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్, పెన్, పెన్సిల్, రబ్బర్, హాల్ టికెట్లను మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. ప్రతి సెంటర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లతో తప్పక బందోబస్తు నిర్వహించాలన్నారు. వేసవి దృష్ట్యా అన్ని కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు సత్వర వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు సహా మందులు, ఆశా వర్కర్లను అందుబాటులో ఉంచాలన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యార్థులకోసం ఇంటర్మీడియెట్, టెన్త్ ఎగ్జామ్స్ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు కలెక్టర్ సూచించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలన్నారు. సమావేశంలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి వెంక్యా నాయక్, విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులు, పోస్టల్, ఆర్టీసీ, విద్యుత్, మెడికల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములపై మరింత నిఘా

ప్రభుత్వ భూములపై మరింత నిఘా ఏర్పాటు చేయాలని, భూముల పరిరక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా 15 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్స్, ఆర్డీఓలు, తహసీల్దార్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని స్పష్టం చేశారు. ఇందు కోసం రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే లాండ్స్, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, డివిజన్ల వారీగా ప్రభుత్వ భూములను గుర్తించాలని అన్నారు. ఆయా భూముల చుట్టూ రాతి కడీలను నాటడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆర్డీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి, సమగ్ర నివేదికను రూపొందించాలన్నారు. ప్రతి ఒక్కరూ సమష్టి బాధ్యతగా పని చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులన్నింటినీ ఈనెల 15వ తేదీలోగా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, మండల తహశీల్దారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య చెప్పారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో అట్రాసిటీ కేసుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ నారాయణరెడ్డి, డీసీపీలు శ్రీనివాస్, సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను త్వరగా పరిష్కరించాలని, దోషులకు శిక్ష పడేలా చేసి, బాధితులకు న్యాయం దక్కేలా చూడాలని కోరారు. అణగారిన వర్గాలపై ఇప్పటికీ వివక్ష, దాడులు కొనసాగుతున్నాయని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దన్నారు. అధికారులు ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలను విధిగా తనిఖీ చేయాలని, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. భూ సమస్యలపై ఆర్డీఓలతో విచారణ జరిపించి వారికి సత్వర న్యాయం దక్కేలా చూస్తామని చెప్పారు. ఈనెల 31లోగా సమస్యలన్నీ పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, రేణిగుంట ప్రవీణ్, నీలాదేవి, జిల్లా శంకర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామరావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉల్లంఘనలపై స్పెషల్ డ్రైవ్

సాక్షి, సిటీబ్యూరో: రాంగ్ సైడ్ డ్రైవింగ్, అస్పష్ట నంబరు ప్లేట్ వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై సిటీ పోలీసులు స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రాంగ్ సైడ్ డ్రైవింగ్‌తో ఒకరు మృతి చెందారు. 21 మంది గాయాల పాలయ్యారు. గత ఏడాది ఏకంగా ముగ్గురు మరణించగా.. 206 మంది క్షతగాత్రులయ్యారు. అస్పష్ట నంబరు ప్లేట్ వాహనదారులకు రూ.200 జరిమానాతో పాటు చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న ఎంపీ చామల, ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నిరుద్యోగ యువత జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టీఎఎస్‌కే) ఆధ్వర్యంలో సుమారు 30 కంపెనీలతో బొంగ్లూర్ ప్రమీద గార్డెన్‌లో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వస్తే ఆ కుటుంబమంతా ఎవరిపైనా ఆధారపడకుండా బాగుపడుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 30 కంపెనీల ప్రతినిధులను తీసుకొచ్చి నాలుగు వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషిచేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు అభిషేక్‌రెడ్డిని అభినందించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ ప్రాంతంలో ఫోర్త్ సిటీ నిర్మాణానికి కంకణబద్ధుడై పనిచేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పలు కంపెనీలు ఫోర్త్ సిటీలో ఏర్పాటు కానున్నట్లు వెల్లడించారు. అనంతరం జాబ్‌మేళాలో ఎంపికైన వారికి ఎంపీ, ఎమ్మెల్యే కలిసి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

కేబుల్.. గుబుల్

- రెచ్చిపోతున్న వైర్ల దొంగలు
- విలువైన రాగి తీగల కోసం చోరీలు
- దాడులకు సైతం వెనకాడని దుండగులు
- వరుసగా వెలుగు చూస్తున్న ఘటనలు
- ఆందోళనలో అన్నదాతలు



మొయినాబాద్ మండలం మేడిపల్లిలో ఇటీవల కేబుల్‌వైర్లను కాల్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మొయినాబాద్: వ్యవసాయ బోర్లను టార్గెట్ చేస్తూ దొంగలు రెచ్చిపోతున్నారు. కేబుల్ వైర్లలో ఉండే రాగి తీగల చోరీకి తెగబడుతున్నారు. ఇటీవల నాలుగు బోర్ల వద్ద కేబుల్ వైర్లు కట్ చేసుకుపోయి, అక్కడే కాపలా ఉన్న రైతుపైనే దాడికి తెగబడ్డారు. మూడు రోజుల క్రితం ఏకంగా 16 మంది రైతుల బోర్ల నుంచి కేబుల్ వైర్లు కత్తిరించుకుపోయారు. దీంతో ఆర్థికంగా నష్టపోవడంతోపాటు దాడులు జరుగుతుండడంతో రైతులంతా ఆందోళనకు గురవుతున్నారు.

తరచూ చోరీలు

కేబుల్ వైర్ల చోరీలు మండలంలో తరచూ వెలుగు చూస్తున్నాయి. మేడిపల్లి ప్రాంతంలోనే కేబుల్ దొంగలు ఎక్కువగా రెచ్చిపోతున్నారు. నెల రోజుల వ్యవధిలో సుమారు 60 మంది రైతులకు చెందిన వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లు కట్ చేసుకుపోయారు. నాలుగు రోజుల క్రితం ముసుగు వేసుకుని వచ్చిన నలుగురు దుండగులు వ్యవసాయ పొలం వద్ద నిద్రిస్తున్న రైతుపై దాడి చేసి గాయపర్చారు. అదే రోజు నాలుగు బోర్ల వద్ద కేబుల్ వైర్లు కత్తరించుకుపోయారు.

మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో..

వ్యవసాయ బోర్ల వద్ద స్టార్టర్ బాక్స్ నుంచి మోటార్‌కు రాగితీగలు ఉండే కేబుల్ వేస్తారు. రాగితీగలకోసమే దొంగలు వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లు కట్‌చేసుకుపోతున్నారు. స్టార్టర్ బాక్స్ నుంచి మోటార్ వరకు సుమారు 5 నుంచి 10 మీటర్ల కేబుల్ వైరు ఉంటుంది. ఒక్కో రోజు 10 నుంచి 20 మోటార్ల వద్ద కేబుల్ కట్‌చేసుకుపోయి.. వాటిని మంటలో కాల్చి రాగి తీగను బటయకు తీసి విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో రాగి కిలో రూ.1,500 వరకు పలుకుతోంది. దీంతో సొమ్ము చేసుకునేందుకు దుండగులు కేబుల్ వైర్ల చోరీకి పాల్పడుతున్నారు.

పోలీసులకు చిక్కని వైనం

తరచూ కేబుల్ వైర్లు తస్కరిస్తున్న దొంగలు పోలీసులకు చిక్కడంలేదు. చోరీలకు సంబంధించి ఎన్నో కేసులు నమోదైనా పోలీసులు ఎక్కడా దొంగలను పట్టుకున్న దాఖలాలు లేవు. రాత్రి 9 నుంచి 12 గంటల మధ్యలో దుండగులు చోరీలకు పాల్పడుతున్నట్లు అనుమానిస్తున్నారు. ఆ సమయంలో పోలీసులు గస్తీ పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


తీవ్రంగా నష్టపోతున్నాం



నెల రోజుల నుంచి తరచూ కేబుల్ వైర్లు కోసుకుపోతున్నారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి దొంగతనాలకు పాల్పడుతున్నారు. కేబుల్ వైర్లు కోసుకపోవడంతో మోటార్లు నడవక పొలాలకు నీళ్లు అందుతలేవు. మళ్లీ కేబుల్ వైర్లు కొని కనెక్షన్ ఇవ్వాల్సి వస్తోంది. దీంతో చాలా నష్టం జరుగుతోంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదు.

– బుల్కపురం నర్సింలు, రైతు, మేడిపల్లి

ప్రత్యేక బృందాలతో నిఘా



ఇటీవల కేబుల్ వైర్ల చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. గ్రామాల్లోని చిల్లర దొంగల పనే అయి ఉంటుందని భావిస్తున్నాం. వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. చోరీలు జరుగుతున్న ప్రాంతాల్లో నిఘా పెంచాం. గ్రామాల్లో, వ్యవసాయ పొలాల్లో అనుమానితులు తిరిగితే రైతులు వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించాలి.

– పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్

ఆలయాల అభివృద్ధికి కృషి

- శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి
- కొమరబండ ఆలయ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

షాబాద్: ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తామని శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పామెన భీంభరత్ అన్నారు. శనివారం నిర్వహించిన కొమరబండ బుగ్గరామేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన వారు మాట్లాడుతూ..భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీసతీష్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పెంటారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌గా చేవెళ్ల వెంకటయ్య

బుగ్గరామేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా చేవెళ్ల వెంకటయ్య, వైస్ చైర్మన్‌గా మాధవరెడ్డి, సభ్యులుగా సత్యనారాయణ, రాణి, సునీత, శ్రవణ్‌కుమార్‌తో ఆలయ కమిటీ పరిశీలకులు మోహన్‌రెడ్డి, ఈఓ శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వెంటకయ్య మాట్లాడుతూ.. చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన అందరికీ రుణపడి ఉంటానని తెలిపారు. గ్రామం నుంచి ఆలయం వరకు రహదారి, వీధి దీపాల ఏర్పాటుకు కృషిచేస్తానని తెలిపారు.

రంజాన్ సందడి

- పవిత్ర మాసం ప్రారంభం
- మసీదుల్లో ఆధ్యాత్మిక వాతావరణం

షాబాద్: పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభమైంది. శనివారం రాత్రి ఆకాశంలో నెలవంక దర్శనంతో పండుగ సందడి మొదలైంది. ఈ నేపథ్యంలో మసీదుల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రంజాన్ మాసాన్ని ప్రతీ ముస్లిం ఎంతో పవిత్రంగా భావిస్తాడు. దివ్య ఖురాన్ ఇదే మాసంలో అవతరించిందని ఇస్లాం మతస్తుల నమ్మకం. ఈనెలలో చేసే ప్రతీ పుణ్య కార్యానికి 70 రెట్ల ప్రతిఫలం లభిస్తుందని విశ్వసిస్తారు. దీంతో నిత్యం ఖురాన్‌ను పఠించి, అత్యంత భక్తి శ్రద్ధలతో కఠోర ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. ప్రతీరోజు మసీదులు, ఇళ్లల్లో 20 రకాల (తరవీహ్) నమాజ్ చదువుతారు. ఉపవాస దీక్ష నరకం నుంచి కాపాడుతుందని హదీస్(ప్రవక్త ప్రవచనాల సంపుటి)చెబుతోంది. ఉపవాసం ఉండి చేసే ప్రార్థనను అల్లా వెంటనే స్వీకరిస్తారని చెబుతారు. ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం స్వర్గానికి ఉండే ఎనిమిది ద్వారాల్లో రయ్యాన్ అనే ద్వారం ఒక రంజాన్ మాసంలోనే తెరిచి ఉంటుందని భావిస్తారు.

నోరూరించే హరీస్

రంజాన్ మాసంలో కొన్ని ప్రత్యేకమైన వంటకాలు నోరూరిస్తుంటాయి. ఇందులో హరీస్ ఒకటి. కేవలం ఈ మాసంలోనే ఈ వంటకాన్ని చేసి విక్రయిస్తారు. ఉపవాస దీక్షలో ఉండి సూర్యాస్తమయం సమయంలో దీక్షను విరమించాక ముస్లింలు ఎంతో ఇష్టంగా ఈ వంటకాలను ఆరగిస్తారు. హరీస్ తయారీకి జిల్లాలోని కొన్ని హోటళ్లు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. ముస్లింలతో పాటు హిందువులు కూడా తింటుంటారు.

ఉపవాస దీక్ష విశేషాలు

రంజాన్‌లో 30 రోజులు ఉపవాస దీక్షలు పాటించాలి. సూర్యోదయానికి ముందే నిర్ధారిత సమయంలో ఆమార పానీయాలు తీసుకోవాలి. దీనిని సహర్ అంటారు. సూర్యాస్తమయ సమయంలో ప్రతి రోజు కొన్ని నిమిషాల తేడాతో ఉపవాస దీక్ష విరమించాలి. దీనిని ఇఫ్తార్ అంటారు. ఖర్జూరం తదితర పండ్లతో ఉపవాస దీక్ష విరమిస్తారు. ఉపవాస దీక్ష సమయంలో విధిగా నమాజులు చేయాలి.

జకాత్ ప్రధానమైనది...

ఇస్లాం మూల విధుల్లో జకాత్ ప్రధానమైంది. ఈనెలలో తమ ఆర్థిక పరిస్థితులను బట్టి కొంత పేదలకు దానం చేస్తారు. దీనినే జకాత్ అని అంటారు. దేవుడు ప్రసాదించిన ధనాన్ని ఆయన కోరిన రీతిలో కొంతైనా ఖర్చు చేయడం వల్ల ఆయన అనుగ్రహం పొందవచ్చునన్నది ముస్లిం సోదరుల విశ్వాసం.

చాంద్ ముబారక్



పహాడీషరీఫ్: నింగిలో శనివారం రాత్రి నెలవంక దర్శనం ఇవ్వడంతో ముస్లింలు ఆనందంలో మునిగిపోయారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ చాంద్ ముబారక్ తెలపుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున జరిగే ఫజర్ నమాజ్‌తో ఉపవాస దీక్షలు పాటించనున్నారు. 30 రోజుల పాటు నియమనిష్ఠలతో ఫజర్, జోహర్, అసర్, మగ్రీబ్, ఇషా నమాజ్‌ల చొప్పున ఐదుసార్లు ప్రార్థనలు చేస్తూ అల్లా స్మరణలో గడపుతారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

షాద్‌నగర్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో నీటి గుంతలో పడి మహిళ మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం భీమారం గ్రామశివారులో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ గోపాల్ కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం భీమారం పంచాయతీ పరిధిలోని ఊరెనికి తండాకు చెందిన జమున (48) శుక్రవారం ఇంటినుంచి బయటకు వెళ్లింది. రాత్రి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. గ్రామ శివారులోని చెరువులో మట్టిని తవ్వడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. జమున చెప్పులు, తువ్వాలు అక్కడ కనిపించడంతో నీటి గుంతలో వెతికారు. ఆమె మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నీటికోసం గుంతలోకి దిగడంతో ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. మృతురాలి కూతురు స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్ రిమాండ్

తాండూరు రూరల్: తండ్రీకొడుకుల మృతికి కారణమైన లారీ డ్రైవర్ మైనొద్దీన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి శనివారం తెలిపారు. తాండూరు మండలం చెంగోల్ గ్రామానికి చెందిన ఈడ్గి గోపయ్యగౌడ్, నర్సింలు గౌడ్‌ల స్కూటీని చెంగోల్ బైపాస్‌రోడ్డు వద్ద శుక్రవారం లారీ ఢీకొనడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. లారీ డ్రైవర్ మైనొద్దీన్ మద్యం తాగి లారీ నడపడం వల్లే ప్రమాదం జరిగిందని.. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

చిట్టీల పేరుతో మోసం

ప్రభుత్వ ఉపాధ్యాయుడితో పాటు అతని భార్యకు రిమాండ్

ఆమనగల్లు: చిట్టీలు వేయడంతో పాటు అధిక వడ్డీ పేరుతో అమాయక ప్రజలను మోసం చేసిన ఆమనగల్లు పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాలాది కిశోర్, అతని భార్య శ్రీలక్ష్మిని శనివారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. చిట్టీలు పూర్తయిన తర్వాత సభ్యులకు డబ్బులు ఇవ్వకుండా, అధిక వడ్డీ ఆశచూపి తమవద్దే పెట్టుకునేవారు. డబ్బులు అడిగినవారికి వివిధ కారణాలు చెబుతూ ఇబ్బందులు పెట్టారు. ఈ నేపథ్యంలో విసుగు చెందిన కొందరు బాధితులు వీరిపై ఆమనగల్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో భార్యాభర్తలను అదుపులోకి తీసుకుని విచారించగా, సుమారు కోటి రూపాయలకు పైగా ప్రజలను మోసం చేసినట్లు అంగీకరించారు. ఈ మేరకు కిశోర్, శ్రీలక్ష్మిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. వీరి బాధితులు ఎవరైనా ఉంటే నేరుగా పీఎస్‌లో సంప్రదించాలని సూచించారు.

డ్రోన్ సాయంతో పిచికారీ చేసేందుకు వచ్చి..

కారులో చెలరేగిన మంటలు

పరిగి: మొక్క జొన్న పంటకు డ్రోన్ సాయంతో మందులు పిచికారీ చేసేందుకు వచ్చిన వారి కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని లక్నాపూర్ గ్రామానికి చెందిన కుర్వ రాములు మొక్క జొన్న పంటకు మందు పిచికారీ చేసేందుకు శనివారం ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన డ్రోన్ నిర్వాహకులను పిలిపించాడు. దీంతో వారు సాయంత్రం పొలంలో డ్రోన్‌తో పిచికారీ చేస్తుండగా ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. రైతులు, బాధితులు కలిసి బిందెలతో నీటిని కారు మీద పోసి మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. కారులో డ్రోన్‌కు సంబంధించిన చార్జింగ్ బ్యాటరీ ఉండటంతోనే మంటలు చెలరేగి ఉంటాయని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


కారులో చెలరేగుతున్న మంటలు

సైబర్ నేరాలపై కళాజాత ప్రదర్శన

దౌల్తాబాద్: సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రవిగౌడ్ సూచించారు. ఆడపిల్లలపై వివక్ష, రెండుగ్లాసుల విధానం, బాల్యవివాహాలు తదితర అంశాలపై కళాజాత బృందం అవగాహన కల్పించారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ ముత్తురాజు, హెడ్‌కానిస్టేబుల్ దాసు, సిబ్బంది, కళాజాత బృందం తదితరులు పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మొయినాబాద్: భార్య పుట్టింటికి వెళ్లిందన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన మంగళి సురేష్‌కుమార్ (45) కటింగ్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారి ఇద్దరి కూతుళ్లను సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టళ్లలో చేర్పించాడు. సురేష్‌కుమార్ కొంత కాలంగా మద్యం తాగి భార్య సంధ్యతో గొడవపడుతున్నాడు. వారం రోజుల క్రితం ఇద్దరి మధ్య మరోసారి గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న సురేష్‌కుమార్ మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తమ్ముడు నరేష్ ఇంటికి వచ్చి తలుపులు తీసి చూసే సరికి సురేష్‌కుమార్ వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక..

కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నమంగళారంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం చిన్నమంగళారం గ్రామానికి చెందిన వడ్డె నర్సింలు (65) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 17 ఏళ్లుగా భార్య, పిల్లలు నగరంలో ఉంటున్నారు. శుక్రవారం రాత్రి నర్సింలు భోజనం చేసి ఇంట్లో పడుకున్నాడు. శనివారం ఉదయం 6 గంటలకు నర్సింలు సోదరుడు రాజు నిద్రలేపడానికి వెళ్లగా అప్పటికే నర్సింలు ఉరివేసుకుని కనిపించాడు. కొంత కాలంగా నర్సింలు కడుపునొప్పితో బాధపడుతున్నాడని.. బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మహిళా సాధికారతకు తోడ్పడాలి

జేఎన్‌టీయూ డైరెక్టర్ సింధు

మొయినాబాద్: గ్రామీణ మహిళ సాధికారత సాధించాలంటే ప్రభుత్వాలు తోడ్పాటునందించాలని జేఎన్‌టీయూ డైరెక్టర్ సింధు అభిప్రాయపడ్డారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా సాధికారతపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు ప్రభుత్వాలతో పాటు విద్యా సంస్థలు పరిశోధనలు చేయాలని.. వినూత్న కార్యక్రమాలు చేపట్టి వారికి అండగా ఉండాలన్నారు. సామాజిక అభివృద్ధి, మహిళా సాధికారత, పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, విద్య, సామాజిక అంశాలపై పరిశోధనలు, అవగాహన సదస్సులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమాలకు ఐసీఎస్ఎస్ఆర్ సహకారం అందిస్తుందన్నారు. అనంతరం సదస్సులో పాల్గొన్న ప్రముఖ నిపుణులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థుల, పరిశోధకులు వారు రూపొందించిన అంశాలు, అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ డైరెక్టర్ బి.సుధాకర్‌రెడ్డి, ఓయూ సూపరింటెండెంట్ జాకబ్ కర్లె, ప్రొఫెసర్ సూర్యనారాయణ, ఆర్కిటెక్ట్ మేధ సనీవదేకర్, సుగంధ, ప్రతిభ, విజయ, ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు జయహరి, ఉదయశ్రీ, చందన, సుచి శ్వేత, సారిక తదితరులు పాల్గొన్నారు.


జేఎన్‌టీయూ డైరెక్టర్ సింధుకు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి

బీఆర్ఎస్ నాయకుడి ఆకస్మిక మృతి

నివాళులర్పించిన పార్టీ నేతలు

ఇబ్రహీంపట్నం: ఎల్మినేడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ బుట్టి రాములు(60) శనివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందారు. ఛాతిలో నొప్పి వస్తోందని చెప్పడంతో వెంటనే ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. ఆయన భార్య యాదమ్మ ఎల్మినేడు సర్పంచ్‌గా పనిచేశారు. కొన్నాళ్ల పాటు సీపీఎంలో పనిచేసిన రాములుకు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో ఉన్న సాన్నిహిత్యం నేపథ్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ముదిరాజ్ సామాజికవర్గానికి కుల పెద్దగా సంఘం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. రాములు మరణ వార్త తెలియగానే కిషన్‌రెడ్డి ఎల్మినేడుకు చేరుకుని నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ కృపేశ్, మాజీ వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి, బుగ్గరాములు, భాస్కర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సామేల్, జంగయ్య, ముదిరాజ్ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు భిక్షపతి తదితరులు నివాళులర్పించారు.


రాములు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి..

- మరో ఇద్దరికి గాయాలు
- స్కూటీని లారీ ఢీకొట్టడంతో ఘటన

ఇబ్రహీంపట్నం: అదుపుతప్పిన లారీ వెనక నుంచి స్కూటీని ఢీకొట్టిన ఘటనలో ఓ బీటెక్ విద్యార్థి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం సరూర్‌నగర్ మండలం బైరామల్‌గూడ, సాగర్ ఎన్‌క్లేవ్, రెడ్డి కాలనీలో నివసించే కొంతం మనోజ్‌రెడ్డి(19) తన స్నేహితుడు అన్వేష్‌రెడ్డితో కలిసి స్కూటీపై మంగల్‌పల్లి సమీపంలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్తున్నారు. తుర్కయాంజాల్ ఆరోగ్య ఆస్పత్రి వద్దకు రాగానే డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపుతప్పిన లారీ (టీఎస్02 యూసి1631) వెనక నుంచి వీరిని ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన మనోజ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా అన్వేష్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. ఈసమయంలో రోడ్డు పక్కన ఉన్న మరో గుర్తు తెలియని వ్యక్తికి సైతం గాయాలయ్యాయని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


మనోజ్‌రెడ్డి మృతదేహం